క్లుప్తంగా

అగ్నిప్రమాదంలో చెరుకు తోట దగ్ధం

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ తెట్టుగుంటపల్లె సమీపంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ప్రసాద్‌కు చెందిన చెరుకు తోట దగ్ధమైంది. చెరుకు పంటపై విద్యుత్ వైర్లు తెగి పడడంతో ప్రమాదం సంభవించిందని బాధిత రైతు తెలిపారు. ఎకరం తోట పూర్తిగా కాలిబూడిదైందని చెప్తున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. లైన్‌మేన్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయాడు.

పక్షవాతం రోగికి అందని బియ్యం


పక్షవాతం వ్యాధిగ్రస్తురాలి రేషన్ కార్డు

పాలసముద్రం: వృద్ధులు, దీర్ఘకాలిక రోగులకు ఉన్నవారికి ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించాలని ప్రభుత్వ ఆదేశాలు. అయితే క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు. వనదుర్గాపురం పక్షవాతంతో బాధ పడుతున్న మహిళకు ఇంటి వద్దకే రేషన్ అందలేదు. అధికారుల ఆదేశాల మేరకు డీలర్ రేషన్ బియ్యం ఇంటి దగ్గర ఇవ్వాల్సి ఉంది. రేషన్ షాపు వద్దకు వచ్చి బియ్యం తీసుకోవాలని, లేకుంటే కార్డు రద్దు చేస్తామని డీలర్ భర్త బెదిరిస్తున్నాడని బాధితురాలు వాపోయింది.

వైభవంగా కల్యాణోత్సవం


ఉభయకర్తలకు స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ సిబ్బంది

గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో ఉన్న శ్రీభూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీ నారాయణ స్వామివారి కల్యాణోత్సవం ఆదివారం రమణీయంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిని మేల్కొల్పారు. స్వామి అమ్మవార్లకు ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలంకరణతో అలంకరించి పట్టు వస్త్రాలు సమర్పించి, అర్చకులు వేదమంత్రోచ్చారణ మధ్య వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. కల్యాణోత్సవం, అన్నదానం ఉభయదారులుగా తిరుపతికి చెందిన సందీప్ రెడ్డి, చిత్తూరుకు చెందిన సందీప్‌రెడ్డి వ్యవహరించారు. ఉభయదారులకు స్వామి చిత్రపటాన్ని ఆలయ సిబ్బంది అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటేష్‌రెడ్డి, పలువురు అర్చకులు పాల్గొన్నారు.

గంగాధరం సేవలు అభినందనీయం


గంగాధరంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గంగాధరనెల్లూరు: ఉపాధ్యాయ వృత్తితోపాటు సమాజ అభ్యున్నతి కోసం ఉపాధ్యాయుడు గంగాధరం ఎంతో కృషి చేశారని పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి గిరిప్రసాద్ రెడ్డి అన్నారు. గంగాధరనెల్లూరు మండలంలోని అక్కన్నగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గంగాధరం ఆదివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు గంగాధరంను ఉపాధ్యాయ యూనియన్ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈఓలు ఆంజనేయులుశెట్టి, గుణశేఖర్‌రెడ్డి, పీఆర్‌టీయూ జనరల్ సెక్రటరీ పురుషోత్తం, చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుపై గ్రానైట్ వ్యర్థాలు


జాతీయ రహదారిపై గ్రానైట్ వ్యర్థాలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగర పరిధిలోని గంగసాగరంలో గ్రానైట్ రాళ్లను రోడ్డులో తెచ్చి పడేస్తున్నారు. చిత్తూరు–వేలూరు జాతీయ రహదారిలో గంగసాగరం జ్యూస్ ఫ్యాక్టరీ ఎదురుగా పనికి రాని గ్రానైట్ బండలు, దిమ్మెలు పడేశారు. ఇదీ ప్రమాదకారిగా మారింది. వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఏదైనా జరగకూడదని జరిగితే ఎలా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. స్థానికంగా ఉన్న చెరువులో గ్రానైట్ వ్యర్థాలను తోలేస్తున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

శిథిల వాహనాలు

- తుప్పు పడుతున్న విలువైన మున్సిపల్ వాహనాలు
- నెలల పాటు కదలని వాహనాలు
- పారిశుధ్య పనులు ఆలస్యం
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట

పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన సుమారు రూ.కోటి విలువ చేసే భారీ వాహనాలను గాలికి వదిలేశారు. దీంతో ఎంతో విలువైన వాహనాలు శిథిలావస్థకు చేరుకుటున్నాయి. భారీ కంపెక్టర్, జేసీబీ, మినీ జేసీబీ తదితర వాహనాలు చిన్నపాటి మరమ్మతులకు గురై నెలలు గడిచిపోతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. పరిస్థితి ఇలానే కొనసాగితే ఆ భారీ వాహనాల్లోని విలువైన విడి భాగాలు చోరీకి గురికాక తప్పదు. – పుత్తూరు


మూలనపడ్డ ఈ-ఆటోలు


డంపింగ్ యార్డులో వదిలిపెట్టిన కంపెక్టర్

పట్టణంలో చెత్త సేకరణ అతి పెద్ద సమస్యగా మారింది. అసలే సిబ్బంది కొరతతో సతమతమవుతున్న వేళ వాహనాలు అందుబాటులో లేకపోవడంతో పారిశుధ్య కార్మికుల పరిస్థితి అగమ్యగోచరమవుతోంది. పుత్తూరు పట్టణ పరిధిలో 27 వార్డులు ఉండగా 60 వేలకు పైగా జనాభా ఉన్నారు. రోజువారీ పారిశుధ్య పనుల్లో ఎంతో కీలకమైన వాహనాలు మూలన పడడంతో చెత్త సేకరణ, తరలింపు పనులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. 10 టన్నుల సామర్థ్యం కలిగిన పెద్ద కంపెక్టర్ టైరు పగిలిపోవడంతో స్థానిక డంపింగ్ యార్డులో దూరంగా వదిలి పెట్టేశారు. అలాగే పాత మున్సిపల్ కార్యాలయం వద్ద జేసీబీ, మినీ జేసీబీలు చిన్నపాటి మరమ్మతులకు గురికావడంతో వాటిని కూడా అలాగే వదిలేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటింటి నుంచి చెత్త సేకరణకు ఈ-ఆటోలను (ఎలక్ట్రిక్ ఆటోలు) అందజేశారు. పుత్తూరులో 12 వాహనాలను తీసుకురాగా అందులో సగానికి పైగా మరమ్మతులకు గురికావడంతో అవి కూడా కదలడం లేదు. దీంతో దాదాపు అన్నీ శిథిలావస్థకు చేరుకుటున్నాయి. జనసంచారం లేని చోట ఈ వాహనాలను వదిలి పెట్టడంతో అందులోని విలువైన విడిభాగాలు దొంగల పాలయ్యే అవకాశం లేకపోలేదు. కార్మికుల కొరతకు తోడు వాహనాల కొరతతో ప్రస్తుతం పట్టణంలో ఎటు చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. వాహనాలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసురావడంపైనే


మరమ్మతులకు గురైన జేసీబీ

పుత్తూరు పట్టణ పరిశుభ్రత ఆధారపడి ఉంది. ఇకనైనా మున్సిపల్ అధికారులు వాహనాలను బాగు చేయించి, విలువైన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడంతోపాటు పరిశుభ్రతకు తగిన ప్రాధాన్యమివ్వాల్సి ఉంది.


నగరం రోడ్డులో పేరుకుపోయిన చెత్త

త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం



కంపెక్టర్, జేసీబీల టైర్లు పగిలిపోయాయి. అవి వినియోగంలో లేవు. రూ.3 లక్షలు విలువైన టైర్లకు ఆర్డర్ పెట్టాం. అవి రాగానే ఇతర మరమ్మతులు పూర్తి చేసి వాహనాలను వినియోగంలోకి తీసుకొస్తాం. పట్టణంలో పారిశుధ్య లోపం లేకుండా ప్రతిరోజూ తగిన చర్యలు తీసుకుంటున్నాం.

–వై.లోకేష్, డీఈఈ, పుత్తూరు మున్సిపాలిటీ


ప్రభుత్వ బాలికల కళాశాల వద్ద పేరుకుపోయిన చెత్త

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం

- పాల్గొన్న మాజీ మంత్రి రోజా


కుంభాభిషేకంలో మాజీ మంత్రి రోజా

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర దళితవాడలో నూతనంగా నిర్మించిన ఓం శక్తి ఆలయ కుంభాభిషేకం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ కుంభాభిషేకం కార్యక్రమంలో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. దళితవాడ ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో అమె విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయం చేశారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, సర్పంచ్ బాబురెడ్డి , మండల ప్రచార కన్వీనర్ శివయ్య, మాజీ సర్పంచ్ రేవతి, మండల కన్వీనర్ వేణురాజు, జిల్లా కార్యదర్శి అనిల్, రాష్ట్ర మహిళ కార్యదర్శి మేరీ తదితరులు పాల్గొన్నారు.

మొగిలి శివాలయం మూత

బంగారుపాళెం: మొగిలి శివాలయాన్ని ఆదివారం మధ్యాహ్నం మూసివేసినట్లు ఈఓ మునిరాజ తెలిపారు. చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని 3 గంటలకు మూసివేస్తున్నట్లు చెప్పారు. తిరిగి సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయ సంప్రోక్షణ నిర్వహించి యథావిధిగా శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మ వారికి అభిషేక పూజలు, నైవేద్యం, హారతి సమర్పించిన తరువాత భక్తులకు సర్వదర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలు, 9 గంటలకు అభిషేకాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు నిర్వహించనున్నారు.

ఘన నివాళి


నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి

గంగాధరనెల్లూరు: వైఎస్సార్ సీపీ మండల నాయకుడు వెంకటేష్ తల్లి చిన్న పాపమ్మ అనారోగ్యంతో పది రోజుల క్రితం మృతి చెందగా ఆదివారం కర్మక్రియల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి మండలంలోని కట్టకిందపల్లి గ్రామానికి చేరుకుని చిన్న పాపమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరిబాబు, మోహన్, గౌతమ్, వినోద్, విష్ణు, వరప్రసాద్, ఎస్‌ఆర్ పురం నాయకులు హరిరెడ్డి, శ్యామ్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వేణుగోపాలుని ఆలయం మూసివేత


చంద్రగ్రహణం కారణంగా మూతపడ్డ శ్రీవేణుగోపాలస్వామి ఆలయం

కార్వేటినగరం: చంద్ర గ్రహణం కారణంగా కార్వేటినగరంలోని శ్రీవేణుగోపాల స్వామివారి ఆలయాన్ని మూసివేసినట్లు టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వేద పండితులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని మూసి వేశారు. అనంతరం ఆలయ అధికారి మాట్లాడుతూ సోమవారం ఉదయం 6 గంటలకు తిరిగి తెరవనున్నట్లు తెలిపారు. ఆలయంలో శుద్ధి, తోమాల, అర్చన, పుణ్యాహవచనం కార్యక్రమం అనంతరం భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీటీడీ ఆలయ అర్చకుడు గోపాలాచారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూతపడ్డ పలు ఆలయాలు

స్కంధ పుష్కరిణి సమీపంలోని కుమారగిరిపై వెలసి ఉన్న వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి ఆలయాన్ని కూడా చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని ఆదివారం మూసి వేశారు. అదే విధంగా సుద్దగుంట సమీపంలో వెలసి ఉన్న శిష్ట సౌందర్యవల్లీ, సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయాన్ని కూడా మూసి వేశారు.

బాధిత కుటుంబానికి భరోసా



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీమంత్రి ఆర్కే రోజా, చిన్నారిని ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి రోజా

నగరి: అనంతపునాయుడుకండ్రిగలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వైఎస్సార్ సీపీ నేత విజయేంద్ర కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించి, వారికి భరోసా ఇచ్చారు. ఆదివారం అనంతప్పనాయుడు కండ్రిగకు వెళ్లిన ఆమె విజయేంద్ర చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపి పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆమె వెంట మున్సిపల్, మండల పార్టీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, తిరుమలరెడ్డి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, దస్తగిర్, నాయకులు మునివేలు, కుమారస్వామి, రవికుమార్, మధు, మురుగ, సత్య, శశికుమార్, కార్తీక్, శశి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి రోజా ఆశీస్సులు

పుత్తూరు: గేట్‌పుత్తూరులో ఆదివారం జరిగిన వీవర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శక్తివేల్ కుమార్తె హాఫ్‌శారీ ఫంక్షన్‌లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. చిన్నారిని ఆశీర్వదించి, కానుకలు అందజేశారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం

బంగారుపాళెం: మండలంలోని మాధవనగర్‌లోని బ్రహ్మనందాశ్రమంలో ఆదివారం శ్రీసత్యనారాయణస్వామి వ్రతపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా శ్రీసత్యనారాయణస్వామి మూల విగ్రహానికి ఆశ్రమ నిర్వాహకులు కేశవానంద స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని మండపంలో కొలువుదీర్చి స్వామివారి వ్రత పూజ నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు సత్యనారాయణస్వామి వ్రత పూజల్లో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమానికి బోడబండ్లకు చెందిన చంద్రయ్య కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహక సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్పందించని ఉపాధి అధికారులు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

పాలసముద్రం: మండలంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో శ్రామికులకు పనులు లేకుండా పోతున్నాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సెప్టెంబర్ రెండో తేదీ మొత్తం ఉపాధిహామీ పథకంలో కూలీలు 683 మంది పనులు చేస్తున్నారు. వార్త వచ్చిన వారం తరువాత 300 మంది కూలీలు తగ్గిపోయారు. హఠాత్తుగా మండలంలో 300 మంది కూలీలు తగ్గిపోవడంపై కూలీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వారు ఆరోపిస్తున్న విధంగా మస్టర్లలో అవినీతి జరుగుతున్నట్టు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఐదు పంచాయతీల్లో మాత్రమే ఉపాధిహామీ పనులు చేపడుతున్నారు. ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు ప్రభుత్వం బీమా చేయాల్సి ఉంది. బీమా చేయాలంటే రూ.20 వారి ఖాతాలో కట్ చేసుకునే వారు. అయితే మండలంలో ప్రతి ఉపాధిహామీ కూలీ వద్ద క్షేత్రసహాయకుడు రూ.20 వసూలు చేస్తున్నాడు. ఉన్నతాధికారులు స్పందించి ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న అవినీతిని అరికట్టాల్సి ఉంది.

అస్తవ్యస్తంగా రహదారి



పాలసముద్రం: మండలంలోని దీనబంధుపురం ఆదిఆంధ్రవాడ గ్రామానికి వెళ్లుతున్న రోడ్డు వర్షానికి కోతలు కోసుకుపోయి గుల్లలు తేలిపోయింది. వాహనదారులు, ప్రజలు రోడ్డుపై వెళ్లడానికి పలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. వాహనదారులు రోడ్డుపై పడిలేచి వెళ్లతున్నారు. వృద్ధులు రోడ్డుపై నడవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. అధికారులు స్పందించి ఆదిఆంధ్రవాడకు సిమెంట్ రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్: ఇంజినీరింగ్ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంచుకోవాలని విశ్వేశ్వరయ్య టెక్నాలిజికల్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ బాలవీరారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల రెండవ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు తమ నైపుణ్యాలను అంతర్జాతీయ ప్రమాణాలకు మించి నేటి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పెంచుకోవాలన్నారు.

జాతర సందడి

- వైభవంగా గెరిగ ఊరేగింపు
- గ్రామదేవత ఆలయాల వద్ద జాతర పొంగళ్లు పెట్టిన మహిళలు


గెరిగ ఉత్సవం ప్రారంభిస్తున్న జాతర నిర్వాహకులు

నగరి: పట్టణంలో గంగజాతర సందడి ఆదివారం మొదలైంది. జాతర సాంప్రదాయ ఆచార వ్యవహారాల్లో భాగంగా గంగమ్మ తల్లికి ప్రీతికరమైన గెరిగ ఉత్సవాన్ని తలారి వీధి గంగమ్మ గుడి వద్ద నిర్వాహకులు ప్రారంభించారు. జాతర హద్దుల్లో ఉన్న ఇళ్లకు ఊరేగింపుగా వెళ్లిన గెరిగకు పసుపుకుంకుమల నీటితో హారతులు తీసి దర్శించుకున్నారు. మహిళలు నైవేద్యం సమర్పించి భండారం స్వీకరించారు. గరిగ ప్రారంభోత్సవంలో జాతర నిర్వాహకులు జ్యోతిరెడ్డి, చిరంజీవి రెడ్డి, టీకే మదన శ్రీనివాసన్, మణిగండ, శ్రీను, బాలాజి, జనార్ధన్, ప్రసాద్, సేడ్, రాజేష్, అశోక్, సునీల్, రవి, కుమార్, మహేష్, తిరుమల పాల్గొన్నారు.

దేశమ్మ ఆలయం వద్ద జాతర పొంగళ్లు

నేత్రదేవత దేశమ్మ ఆలయంలో మహిళలు ఆదివారం జాతర పొంగళ్లు పెట్టారు. దీంతో ఆలయ ఆవరణ పొంగళ్లు పెట్టేవారితో నిండిపోయింది. అధిక సంఖ్యలో పొంగళ్ల కోసం పొయ్యిలు వెలిగించడంతో పొగలు, సెగలతో నిండిపోయింది. జాతర పొంగళ్లను అమ్మవారి పాదుకల వద్ద ఉంచి మహిళలు నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకొని తీర్థాన్ని కళ్లలో చల్లుకున్నారు. ఈఓ రామచంద్రయ్య, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వసతుల్లేని పెట్రోల్ బంకులు

సాధారణంగా మనం పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనానికి పెట్రోలు కొట్టించుకుని వెళ్లిపోతూ ఉంటాం. అక్కడ కేవలం పెట్రోలు మాత్రమే దొరుకుతుందని భావిస్తాం. అయితే అక్కడ మరిన్ని సేవలు పొందే అవకాశమూ ఉంది. అవి కూడా ఉచితంగా.. ఎందుకంటే మనం ప్రతి లీటర్ డీజిల్ లేదా పెట్రోల్‌పై వ్యాట్ రూపంలో పన్ను చెల్లిస్తున్నందున బంక్ యజమానులు సౌకర్యాలన్నీ కల్పించాల్సి ఉంటుంది. కానీ జిల్లాలోని చాలా పెట్రోలు బంకుల్లో సేవలు కానరావడం లేదు. కొన్నిచోట్ల టాయిలెట్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. మరి కొన్ని చోట్ల గాలి యంత్రాలు పని చేయడం లేదు. మరుగుదొడ్డి, తాగునీటి నిర్వహణ కోసం ఆయా కంపెనీల యజమాన్యాలు ప్రతి నెలా నిధులు విడుదల చేస్తున్నా..వాటిని బంక్ నిర్వాహకులు ఖర్చు చేయకుండా మింగేస్తున్నారు. ఫలితంగా జిల్లాలో చాలా చోట్ల పెంట్రోల్ బంక్‌లో సౌకర్యం లేక దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. –విజయపురం

- మరుగుదొడ్లు, తాగు నీటి వసతులు శూన్యం
- దూరం ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు తప్పని ఇబ్బంది
- ఉచితంగా వాహనానికి గాలి నింపాలి



స్వచ్ఛమైన తాగునీరు

జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన పెట్రోలు బంకులు దాదాపుగా 200 పైగానే ఉన్నాయి. వీటి వద్ద స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచాలి. అక్కడ ఆర్‌ఓ యంత్రం, వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలి. ఏ పెట్రోలు బంకులోనైనా తాగునీరు అందుబాటులో లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు.

మరుగుదొడ్లు..

స్వచ్ఛ భారత్‌లో భాగంగా అన్ని పెట్రోలు బంకుల్లో వాహన చోదకులు, ప్రజలకు మూత్రశాలలు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని ఏర్పాటు చేసినా... వినియోగదారులను అనుమతించడం లేదనే విమర్శలున్నాయి. మరిన్ని చోట్ల అసలు మరుగుదొడ్డే కనిపించని పరిస్థితి, బంకుల్లో ఇలాంటి సౌకర్యాలు లేకపోతే పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు. లీటర్ పెట్రోలు లేదా డీజిల్ కొనుగోలుకు మనం చెల్లించిన సొమ్ములో నాలుగు నుంచి ఎనిమిది పైసలు వరకూ మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణకు ఉపయోగించాల్సి ఉంటుంది.

ఫోన్ సదుపాయం

అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ వినియోగించుకునే సదుపాయం కూడా పెట్రోలు బంకుల్లో ఉండాల్సిందే. వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యల్లో చిక్కుకుంటే, మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పని లేదు. ఏదైనా పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి ఏ నంబరుకైనా కాల్ చేసుకోవచ్చు.

నాణ్యతా ప్రమాణాలు

పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలను తెలుసుకునే హక్కు వినియోగదారులందరికీ ఉంటుంది. దీనికి సంబంధించిన సదుపాయాన్నీ బంక్ యజమాన్యాలు కల్పించాలి. పెట్రోల్, డీజిల్ తక్కువగా వచ్చిందని అనుమానం వస్తే వినియోగదారులు అక్కడికక్కడే పరీక్షించుకోవచ్చు. అందు కోసం క్వాలిటీ చెక్ టిష్యూ పేపర్‌ను అందుబాటులో ఉంచాలి. నోటీసు బోర్డులో సంబంధిత ఆయిల్ కంపెనీల సేల్స్ ఆఫీసర్ నంబరును తప్పకుండా ప్రదర్శించాలి.

ప్రథమ చికిత్స కిట్

ప్రతి పెట్రోలు బంకులో ఫిర్యాదు బాక్స్, రిజిస్టర్ అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారుల తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ప్రథమ చికిత్స కిట్ ప్రతి బంక్ వద్ద ఉండాలి. ప్రజాలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది. ఆ ప్రథమ చికిత్స పెట్టెలో మందులు తప్పకుండా ఉండాలి.

గాలి ఉచితంగా పట్టాల్సిందే..

వాహనాల టైర్లలో గాలి నింపడానికి, గాలి ఎంత ఉందో తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో కచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఒక వ్యక్తిని నియమించాలి. బంకుల్లో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయకున్నా, వాహనాదారులు కోరితే టైర్లలో గాలి తనిఖీ చేయాలి. ఇటీవల వాహనాల టైర్లలో సాధారణ గాలికి ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు.